


# నాగులగుట్ట కథలు

- నిశాపతి

**కొత్త శీర్షిక ప్రారంభం**

'శ్రీ సీతారామాభ్యోన్నమః, ఉపాదానమండీ' అంటూ ఇల్లిల్లూ తిరిగే వీరిభొట్లు ఆ రోజు ఆ పని మానేసి అక్కడే వున్నాడు. మోకాళ్ళపైకి మురికి కొల్లాయిగుడ్డ కట్టుకుని, కట్టె మంట సెగకి చెమట కారుస్తూ, బెల్లం జిలేబీలు చేసి అమ్మే గురివి శెట్టీ అక్కడే వున్నాడు. నడిబజార్లో దుంగల్ని వేసుకుని, చీల్చి, పొయిలోకి కట్టె పేళ్ళ కింద కొట్టి అమ్మి జీవించే 'సామేలూ' అక్కడే. ఒకరేమిటి, ఊరు ఊరంతా, ఆడామగా, పిల్లా మేకా, ముసిలీ ముతకా, అంతా అవాళ అక్కడే వున్నారు.

కరణం గారు ఓ మూలగా చెక్కకుర్చీలో కూర్చుని, చుట్టపొగపీల్చి గుప్పుగుప్పున వదుల్తున్నారు. మునసబుగారు అవసరం లేకపోయినా ఓ కర్రపుచ్చుకుని జనాల్ని అదిలిస్తున్నారు.

రంగస్థలం రంగడి గుడి నుంచి గట్టిగా అంగలేస్తే ఓ పావుగంట దూరంలో వుంది.

తిప్పనాగులు గుట్టకి నూరడుగులు అవతల, ధర్మారం పొయేదారికి అడ్డంగా, బకాసురుడి కోసం గాడిపొయ్యి తవ్వుతున్నట్లు పదేళ్ళుగా తవ్విపోస్తూనే వున్నారు. బాకీలు వసూలు చేసుకునేందుకు ధర్మారం వెళ్ళే 'వడ్డీల వెంకట్రాముడు' దొమ్మరిసాని తీగ మీద నడిచినట్లు, కాలవ కడ్డంగా వేసిన తాటి పట్టెల మీద నడవలేక పదేళ్ళుగా గవర్నమెంటును తిట్టుకుంటూనే వున్నాడు. సింగరకొండ ఆంజనేయస్వామి దగ్గరకి గూడు బళ్ళలో వెళ్ళే ఆడంగులు, బళ్ళు చుట్టు తిరిగి, బోలెడు ఆలశ్యంగా పోవలిసి వచ్చినందుకు పదేళ్ళుగా శాసనార్థాలు పెడుతూనే వున్నారు.

కాని, అందరూ అన్నీ మర్చిపోయి ఇప్పుడక్కడికి చేరారు. ఎవడికి వాడికే పట్టుపుట్టేనుగు మెళ్లో దండ వేసినట్లుంది. అంతా తీవిగా, అందంగా, ఆనందంగా వున్నారు.

దీనికంతా కారణం ఆరోజు కిష్టమ్మ ఆవూళ్ళో ప్రవేశించబోతోంది. నాలుగు రోజుల కిందట నాగార్జున సాగర్‌లో బైలుదేరింది. టాపులేని కారులో మెల్లిగా వెళ్తున్న ప్రకాశం పంతులుగారిలా, దారిపొడుగుతా వున్న తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ పలకరిస్తూ, యిప్పటికి ఆ ఊరు చేరుతుంది.

## సొగసు చూడతరమా!

ఆ వచ్చే కిష్టమ్మ ఎలావుంది ?

ఒక చోట పాములాగా మెలికలు తిరుగుతుంది. ఒక చోట చెట్టుకొమ్మలమీదినుంచి దూకే చిలిపి పిల్లలా 'డ్రాపు'ల మీది నించి గెంతుతుంది.

మరో చోట తల్లి కడుపులో తల దాచుకున్న సీతామ్మ వారిలా', డీప్‌కట్స్‌లో ఒదిగి ఒదిగి మాయమౌతుంది. మళ్ళీ అంతలోనే విజృంభిస్తుంది.

గలగలా పారుతుంది.

కిలకిలా నవ్వుతుంది.

బిరబిరా ఉరుకుతుంది.

చరచరా పాకుతుంది.

సురసురా గిరగిరా సుళ్ళు తిరుగుతుంది.

అప్పుడావె 'సొగసు చూడ చాలు నా చూపులు పదునారు వేలు' అన్నట్లుంది. ఒకపరికొకపరి వయ్యారమై అన్న అన్నమయ్య అమ్మవార్లా వుంది.

ఒళ్ళోవున్న చిన్నచిన్న చేప పిల్లల్ని అదరగొడుతుంది. బెదరగొడుతుంది. చెదరగొడుతుంది. పాము పిల్లల్ని విసిరికొడుతుంది. ఎదిరించిన 'జీవా'ల్ని సముద్రగర్భం చేరుస్తుంది.

బుడగల బొండు మల్లెలు తురుముకుంటుంది. నురగల సన్న జాజులు దోపుకుంటుంది.

గరప నేలల్లో కనకాంబరాలు గైసేసుకుంటుంది.

అది భరతమా ? కూచిపూడా ? కథక్ ? కథాకళీ ?

ఏదీకాదు. అన్నీ ! అది జీవన నృత్యం. ఆనంద లాస్యం.

కాంక్రీటు చెయ్యి అడ్డంగా జాపి తనని ఆపిన కబంధుడి బంధం నుంచి విముక్తి పొందిన హర్షోత్సవం.

కాలువ పక్క జనం హడావిడి పడుతున్నారు. బ్రాహ్మలు నూరేళ్ళ క్రితం తమ తోటివారు గోదావరి తీరంలో పాడిన పాటనే మార్చి తెలుగునాట అభియంతల్ని (ఇంజినీర్లని) స్మరిస్తూ పాడుతున్నారు.

''నిత్య కృష్ణానదీ స్నాన, పుణ్యదోయో మహాభామతీః

నమామ్యాంధ్రీయ దేశీయం, అభియంతాం భగీరథాం''అని.

వడ్డీల వెంకట్రాముడు ధర్మారం దారిలో చిన్న బ్రిడ్జి కావాలని మహజరు రాసుకొచ్చాడు. పోలాలకి నీళ్లందే రైతులు , అప్పుడే అక్కడున్న జూనియర్ ఇంజినీర్లలాంటి అల్లుళ్ళు వచ్చినట్లు కలలుగంటున్నారు. మట్టి మిద్దెల స్థానంలో డాబా యిళ్ళు వూహించుకుంటున్నారు. పోలాలకి నీళ్ళందని రైతులు పిటీషన్లు రాసి తెచ్చారు.

రంగయ్య పంతులు పెట్లోంచి కలరావుండల వాసన వేసే ఖద్దరు చొక్కాతీసి వేసుకుని వచ్చి, వుండుండి 'మహాత్మాగాంధీకి' అని అరుస్తున్నాడు. ఓ పదిమంది కుర్రగ్యాంగు అలవాటుగా 'జై' అంటున్నారు.

ఆడవాళ్ళు పసుపు, కంకుమ, కొబ్బరికాయలు తీసుకుని వచ్చారు. పట్టుచీరెలు కట్టుకుని, మొగుళ్ళన డిగి యినప్పెట్టెలు తెరిపించి నగలు తీసి పెట్టుకుని, ముస్తాబై, గంగమ్మ పూజకి తరలి వచ్చారు. వీళ్ళందరికీ జంతికలు, పుణుకులు, చక్కెర పాకం కడ్డీలు, జీళ్ళు అందించే జంగిడీల వాళ్ళు గూడా అక్కడే కిష్టమ్మ రాక కోసం ఎదురు చూస్తూ నిల్చున్నారు.

పక్కజిల్లాకి చెందిన సహాయమంత్రీ, ఆయనతో తమ ఎస్.ఈ.గారు వస్తున్నారని తెలిసిన సూపర్వైజర్లు కాళ్ళు విరగదొక్కుకుంటున్నారు. ఆ రోజుల్లో అపురూపమైన 'మినరల్‌వాటర్ బాటిల్స్' వాళ్ళకోసం దాచలేక అవస్థ పడుతున్నారు. మీటింగ్ కోసం బల్లలు, కుర్చీలు వర్క్ మేస్త్రీలు ఏర్పాటు చేస్తున్నారు.

మంత్రిగారు రావలసిన సమయం సమీపించింది. వచ్చింది. దాటిపోయింది. కాని మంత్రిగారు రాలేదు.

మంత్రిగారి కోసం మహానది ఆగుతుందా!!

ఈ లోపులో కిష్టమ్మ రానూ వచ్చింది.

ఎలిజిబెత్ రాణిలా చేతులూపి ముందుకు వెళ్ళనూ వెళ్ళింది. ❑



రచయిత ఫోన్ నెంబరు: **9848330708**